క్లుప్తంగా

ఖాదర్‌లింగస్వామి దర్గాలో ఫాతెహాలు



దర్గాలో ఫాతెహాలు చేస్తున్న ధర్మకర్త

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంలో మత సామరస్యానికి ప్రతీకగా వెలుగొందుతున్న జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాకు గురువారం భక్తులు తరలివచ్చి స్వామి సన్నిధిలో భక్తి శ్రద్ధలతో ఫాతెహాలు, ప్రార్థనలు జరుపుకున్నారు. దీంతో దర్గా పరిసర ప్రాంతాలన్నీ భక్తులతో సందడిగా మారాయి. జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులు పిండి వంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్తీలు స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతేహాలను చేపట్టారు.

రస్తాను మూసేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

ఆదోని రూరల్: ఆదోని మండలంలోని పర్వతాపురం గ్రామంలోని సర్వేనంబర్ 275, 269, 270 పొలాలకు వెళ్లే రహదారిలో రైతులను వెళ్లకుండా కొందరు అడ్డుకట్ట వేశారని, వెంటనే విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు ఈరన్న, నారాయణప్ప తదితరులు కోరారు. ఈ మేరకు గురువారం ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వినతి పత్రం అందజేశారు.వారు మాట్లాడుతూ గతంలో కూడా అనేక మార్లు రస్తాకు అడ్డుకట్ట వేసి వెళ్లకుండా చేశారన్నారు. వెంటనే విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని విన్నవించారు. స్పందించిన సబ్‌కలెక్టర్ విచారణ చేపడతామని హామీ ఇచ్చారు.

టీబీ యూనిట్ తనిఖీ



రికార్డులను తనిఖీ చేస్తున్న జిల్లా టీబీ లెప్రసీ అధికారి మల్లికార్జున రెడ్డి

ఆదోని సెంట్రల్: జిల్లా క్షయ, లెప్రసీ అధికారి మల్లికార్జున రెడ్డి గురువారం టీబీ యూనిట్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. టీబీకి చెందిన కేసులు, లాబ్ రిపోర్ట్‌కు సంబంధించిన రిజిస్టర్లను పరిశీలించారు. గళ్ల పరీక్షలను నిర్వహించడానికి ఇచ్చిన టార్గెట్‌ను పూర్తి చేసినందుకు సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం హవ్వన్నపేటలోని అర్బన్ హెల్త్ సెంటర్ సందర్శించి అక్కడ ఏఎన్ఎం, ఆశా వర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఎన్‌సీడీసీ సర్వే చేస్తున్న విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. వీరి వెంట ఉప వైద్యాధికారి డా.సత్యవతి, ఎంటీసీ డా.షేకున్ బాను, ఎంఓ షైనాజ్ బేగం పాల్గొన్నారు.

అపార్ నమోదు పకడ్బందీగా చేపట్టండి

కౌతాళం: అపార్ నమోదును పకడ్బందీగా చేపట్టాలని తహసీల్దారు మల్లికార్జునస్వామి, ఎంపీడీఓ సుబ్బారాజు సూచించారు. అపార్ ఐడీ జనరేట్ కోసం కౌతాళం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని వారు పరిశీలించారు. వారు మాట్లాడుతూ ఆధార్ అప్డేషన్‌ను పూర్తి చేయాలన్న లక్ష్యంతో కళాశాలల్లో, ఆయా పాఠశాలల్లో కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

నందవరం: స్థానిక ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రంగన్న డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఈఓపీఆర్డీ సందీప్‌కు ఎస్ఎఫ్ఐ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ కాలనీలో దాదాపు 300 కుటుంబాలు ఉన్నాయని, కాలనీకి తాగునీరు సరఫరా కావడం లేదని వాపోయారు. కాలనీ మొత్తానికి మూడు పబ్లిక్ కుళాయి మాత్రమే ఉన్నాయని, అవి కూడా 4 రోజుల కొక్కసారి మాత్రమే తాగునీరు వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు రత్నం, అబ్దుల్ పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపోకు కొత్త బస్సులు



బస్సులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బీవీ

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక ఆర్టీసీ డిపోకు ఇప్పటి వరకు 12 కొత్త బస్సులు వచ్చినట్లు డీఎం అమర్నాథ్ తెలిపారు. గురువారం ఆర్టీసీ డిపో ఆవరణలో నాలుగు కొత్త బస్సులను ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. ఎమ్మిగనూరు నుంచి నెల్లూరుకు 2 బస్సులు, తిరుపతి, గూడురు మీదుగా కర్నూలుకు ఒక బస్సుకు ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు.

నేడు మాలల ఆత్మీయ సమ్మేళనం

ఆదోని రూరల్: పట్టణంలోని జేపీ గార్డెన్‌లో శుక్రవారం నిర్వహిస్తున్న మాలల ఆత్మీయ సమ్మేళన సభకు మాలలు తరలిరావాలని మాల మహానాడు నాయకులు కుమారస్వామి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సాయిరామ్ పిలుపునిచ్చారు.

‘భవిత’కు లేదు భరోసా!

- భవిత కేంద్రాలపై ప్రభుత్వ నిర్లక్ష్యం
- ఫిజియోథెరపీ డాక్టర్లు కరువు
- ప్రత్యేక శిబిరాలు లేవు
- యంత్ర పరికరాలు కూడా అందించని వైనం



భవిత కేంద్రం



భవిత కేంద్రంలో చదువుకుంటున్న ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలు

ఆదోని సెంట్రల్: ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను గుర్తించి వారికి మేమున్నామంటూ భరోసా కల్పించేందుకు భవిత కేంద్రాలను ఏర్పాటు చేశారు. అయితే కూటమి ప్రభుత్వం ఈ కేంద్రాలను నిర్లక్ష్యం చేస్తోంది. మానసికంగా శారీరకంగా అవస్థలు పడుతున్న చిన్నారులకు ఫిజియోథెరపీ అందించే డాక్టర్లు కరువయ్యారు. ప్రత్యేక శిబిరాలు కూడా నిర్వహించడం లేదు. దీంతో ఎంతో మంది మానసిక సంఘర్షణతో బాధపడుతున్న వారు శిబిరాలు, పరికరాలు కోసం ఎదురు చూస్తున్నారు. అయినా ప్రభుత్వం మాత్రం వారిని గుర్తించడం లేదు.

ఐఈఆర్‌టీలతోనే అన్నీ థెరపీలు

ఆదోని నియోజకవర్గంలో ప్రత్యేక అవసరాలు కలిగిన వారు 450 మంది ఉన్నారు. అందులో ఐదేళ్ల నుంచి 15 ఏళ్ల లోపు చదువుకు దూరంగా ఉన్న పిల్లలను గుర్తించి భవిత కేంద్రంలోనే వారికి విద్యను అందిస్తున్నారు. ఆదోని భవిత కేంద్రంలో 35 మంది పిల్లలు విద్యను అభ్యసిస్తున్నారు. ఇక్కడ భవిత కేంద్రంలో ప్రతి సోమవారం మానసిక వైకల్యం, వినికిడి లోపం, ఆటిజం, దృష్టిలోపం వంటివి కలిగిన వారికి ఫిజియోథెరపీ నిర్వహించాల్సిన ఉంది. అయితే ఆదోని భవిత కేంద్రానికి ఫిజియోథెరపీ డాక్టర్ లేక పోవడంతో పిల్లలకు ఫిజియోథెరపీ శిబిరాలను నిర్వహించడం లేదు. భవిత పాఠశాలలో ఐఈఆర్‌టీలుగా పని చేస్తున్న వారే ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ, బ్రెయిలీ నైపుణ్యాలతో పాటు నడవడికలను నేర్పిస్తున్నారు. అంతేకాకుండా పిల్లల పట్ల తల్లిదండ్రులు అనుసరించాల్సిన నడవడికపై కౌన్సిలింగ్ ఇస్తున్నారు.

యంత్ర పరికరాల కోసం ఎదురు చూపులు

ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు భవిత కేంద్రంలో ఉచితంగా ఉపకరణాలు అందించాలి. క్యాంపులను నిర్వహించి ఎవరికి ఏఏ పరికరాలు అవసరమో గుర్తించి వారికి అందిస్తారు. వినికిడి యంత్రం, వీల్‌స్చైర్స్, ట్రైసైకిల్, చంక కర్రలు తదితర పరికరాలు అందించాల్సి ఉంది. 5 నుంచి 18 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన దివ్యాంగ చిన్నారులకు వైద్య సేవలను అందించాలి. విద్యాశాఖ, సమగ్రశిక్ష అధ్వర్యంలో వీరికి మెరుగైన సదుపాయాలను కల్పించాల్సి ఉండగా వారు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినబడుతున్నాయి. కనీసం ఫిజియోథెరపీ డాక్టర్లను కూడా నియమించలేక పోయారు. ఆదోని మండలంతో పాటు కోసిగి, కౌతాళం, మంత్రాలయం, ఎమ్మిగనూరు, ఆస్పరి వంటి పలు మండలాలల్లో ఫిజియోథెరపీ డాక్టర్లు లేరు. దీంతో చాల మంది పేద, మధ్యతరగతి వారు చేసేది లేక పిల్లలను అలాగే ఉండనిస్తున్నారు. ఫిజియోథెరపీ చేయిస్తే చిన్నారులకు ఎంతో మేలు కలుగుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

డాక్టర్‌ను నియమిస్తే బాగుంటుంది



ప్రస్తుతం భవిత కేంద్రంలో ఫిజియోథెరపీ డాక్టరు లేక పోవడంతో కొంత మంది ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం డాక్టరును నియమిస్తే బాగుంటుంది. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు కూడా మానసిక, శారీరక అంశాలపై అవగాహన కల్పించి విద్యను అందించడానికి భవిత కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగింది. చాలా మంది తల్లిదండ్రులకు పిల్లలపై అవగాహన లేక ఇళ్లలోనే ఉంచేస్తున్నారు. దీంతో మానసిక పరికత్వం చెందక చాల మంది మంచానికే పరిమితమవుతున్నారు. ఫిజియోథెరపీ డాక్టరు ఉంటే విద్యార్థులకు, తల్లిదండ్రులకు పలు అంశాలపై అవగాహన కల్పించే వారు.

– శాంతకుమార్, ఈఐఆర్‌పీ

నిబంధనల మేరకు పాఠశాల నిర్వహించాలి



జీనియస్ గ్లోబల్ స్కూల్ సిబ్బందికి సూచనలిస్తున్న డిప్యూటీ ఈఓ వెంకరమణరెడ్డి

గోనెగండ్ల : నిబంధనల మేరకు పాఠశాల నిర్వహించాలని పాటించాలని డిప్యూటీ ఈఓ వెంకటరమణ రెడ్డి జీనియస్ గ్లోబల్ స్కూల్ యాజమాన్యాన్ని ఆదేశించారు. మండల కేంద్రం గోనెగండ్లలో నిర్వహిస్తున్న జీనియస్ గ్లోబల్ స్కూల్ నిబంధనలు పాటించడం లేదనే ఫిర్యాదు మేరకు గురువారం డిప్యూటీ ఈఓ పాఠశాలను ఆకస్మింగా తనిఖీ చేశారు. పాఠశాల ఆవరణలో అపరిశుభ్రంగా ఉండడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాల వెనుక భాగం ప్రహరీకి ఆనుకొని పెట్రోల్ బంకు ఉండటంతో మూడు గదులను మూసివేయాలని, లేక పక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే ఆ పాఠశాలలో ప్రభుత్వ అనుమతి లేకుండా ఎనిమిదవ తరగతి పిల్లలకు బోధన చేయడం, అందుకు సంబంధించిన రికార్డులు లేకపోవడంతో యజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాల యజమానికి వేరే తాలుకాలో ఉన్న తమ పాఠశాలలో ఇక్కడి విద్యార్థుల పేర్లను నమోదు చేసి, ఇక్కడ విద్యాబోధన చేస్తున్నట్లు గుర్తించారు. ఇలాంటి తప్పుడు పనులు మానుకోవాలని ప్రిన్సిపాల్‌ను హెచ్చరించారు. అనంతరం ఉన్నత పాఠశాల, ఏపీ మోడల్ స్కూల్, కులుమాల పాఠశాలలను తనిఖీ చేశారు. ఎంఈఓలు రామాంజినేయులు, నీలకంఠ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ వెంటనే అమలు చేయాలి



మాట్లాడుతున్న ఏపీ ఎమ్మార్పీఎస్ నాయకులు

మంత్రాలయం : ఎస్సీ వర్గీకరణను వెంటనే అమలు చేయాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండువీరయ్య డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ సల్కాపురం రవికి అందజేశారు. ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 77 సంవత్సరాలు గడిచినా అంటరానితనం, గిరిజనుల పేదరికం తొలగిపోలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు యేబు, ప్రభుదాస్, మాణిక్యరాజు, కుమార్, దేవదాసు, అబ్రహం తదితరులు ఉన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కండి



రక్తదానం చేస్తున్న విద్యార్థి

ఎమ్మిగనూరురూరల్: ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని సెయింట్ జాన్స్ ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.వీ.వీరన్న అన్నారు. గురువారం మండల పరిధిలోని సెయింట్ జాన్స్ ఇంజనీరింగ్, ఫార్మసీ కాలేజీల్లో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో కర్నూలు విశ్వభారతి బ్లడ్ బ్యాంక్‌చే రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. కాలేజీలో 80 విద్యార్థులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ తనూజ్, ఇంజినీరింగ్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ డా. కె. సుధాకర్, ఫార్మసీ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ డా.వాగీష్, ఎన్ఎస్ఎస్ కార్యనిర్వహణ అధికారి రఘు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యంతో చదవాలి



విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్లు అందజేస్తున్న రిటైర్డ్ ఐజీ

కోసిగి: ప్రతి విద్యార్థి జీవిత లక్ష్యాన్ని నిర్దేశించుకొని కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని రిటైర్డ్ ఐజీ మహ్మద్ ఇక్బాల్ అన్నారు. గురువారం కోసిగి బాలుర ఉన్నత పాఠశాలను ఆయన పూర్వపు విద్యార్థుల సంఘం అధ్యక్షుడు ఇల్లూరి ఆదినారాయణ, పాఠశాల హెచ్ఎం ఖలీల్ అహ్మద్‌లతో కలిసి సందర్శించారు. ఆయన మాట్లాడుతూ తాను పుట్టిన గ్రామం కోవెలకుంట్ల అయినా కోసిగి హైస్కూల్‌లో 1972 సంవత్సరంలో 10వ తరగతి వరకు చదువుకున్నట్లు తెలిపారు. అనంతరం పాఠశాల నుంచి జాతీయ ఖోఖోలో రాణిస్తున్న విద్యార్థికి రూ.10వేలు ఆర్థిక సాయం, విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేశారు. అనంతరం ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌ను, కోసిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ ఫరూక్, పూర్వ విద్యార్థులు హాజీ ఉస్మాన్, రామకృష్ణ, గట్టు ఈరన్న, డీసీ నారాయణ పాల్గొన్నారు.

కాల్పులు జరిపిన పోలీసులపై చర్యలు తీసుకోవాలి



సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వినతి పత్రం అందజేస్తున్న జేఏసీ నాయకులు

ఆదోని రూరల్: ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని సంబల్ పట్టణంలో మసీదు సర్వే సందర్భంగా యువకులపై కాల్పులు జరిపిన పోలీసులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని ఆదోని ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ తరపున ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ కాల్పుల్లో మరణించిన ఐదుగురు యువకుల కుటుంబాలకు తలా రూ.50 లక్షలు పరిహారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు ఎ.నూర్‌అహ్మద్, ఎంహెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి గౌస్‌ఖాన్, ఎస్‌డీపీఐ ఆదోని పట్టణాధ్యక్షుడు, ఎంఐఎం ఆదోని నియోజకవర్గ అధ్యక్షుడు జునైద్, కాంగ్రెస్ పార్టీ కర్నూలు జిల్లా మైనార్టీ విభాగం మాజీ అధ్యక్షుడు నూర్ మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్లను పరిష్కరించాలి

ఆదోని టౌన్: తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ గురువారం 104 ఉద్యోగులు ఆదోని ఎమ్మెల్యే పార్థసారథికి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ తమకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు ఇవ్వాలని, కుటుంబాలను పోషించడం చాలా కష్టమవుతుందని వాపోయారు. 104 సేవలను ప్రభుత్వమే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా నిర్వహించి ప్రజాధనాన్ని వృథాకాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో 104 ఉద్యోగులు మోహన్, రాజు, మధు, జీవన్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి



ఎమ్మిగనూరు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రుద్రగౌడ్, నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మాజ్యోతిరావు పూలే అని వైఎస్సార్‌సీపీ వీరశైవ లింగాయత్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు రుద్రగౌడ్, పట్టణ అధికార ప్రతినిధి సునీల్‌కుమార్, కౌన్సిలర్ నాగేషప్ప అన్నారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం పూలే 134వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గడ్డం నారాయణరెడ్డి, మాజీ టౌన్‌బ్యాంక్ చైర్మన్ బీఎస్ నాగరాజు, మున్సిపల్ కౌన్సిలర్లు డిష్ కేశవరెడ్డి, సుధాకర్, కోటకొండ నరసింహులు, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు విరూపాక్షిరెడ్డి, పాల శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

– స్థానిక కుర్ణి కల్యాణ మండపంలో పూలే చిత్రపటానికి ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు.

– వైష్ణవి కళాశాలలో బీసీ,ఎస్సీ,ఎస్టీ,బీసీ మైనారిటీ విద్యార్థి సంఘ జిల్లా అధ్యక్షుడు నరసన్నయాదవ్,ఎస్ఎంఎల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ మహబుబ్‌బాషా ఆధ్వర్యంలో పూలే వర్ధంతిని నిర్వహించారు.

గోనెగండ్ల : మండల కేంద్రంలోని ఏపీ మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పూలే వర్ధంతిని జరుపుకున్నారు. యూటీఎఫ్ నాయకుడు నరసింహ, ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష కార్యదర్శులు పవన్, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆదోని టౌన్: పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదోని పట్టణ అధ్యక్షుడు బి.దేవా ఆధ్వర్యంలో పూలే వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు నల్లారెడ్డి రామకృష్ణ, దానం రమేష్, రంగస్వామి, సూరి, తాయన్న, సూర్య, రంగస్వామి, జహీర్ తదితరులు పాల్గొన్నారు.



ఆదోనిలో నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆదోని రూరల్: పట్టణంలోని బీసీ ఫెడరేషన్ కార్యాలయంలో గురువారం బీసీ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దస్తగిరినాయుడు ఆధ్వర్యంలో జ్యోతిరావుపూలే వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు చిన్న ఈరప్ప, పగడాల కిరణ్, లక్ష్మీనారాయణ, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళం ఎస్సీ కమ్యూనిటీ భవనంలో ఎమ్మార్పీఎస్ కౌతాళం గ్రామ అధ్యక్షుడు ఆనంద్ ఆధ్వర్యంలో ఆ సంఘం నాయకులు పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఉలిగప్ప, రామాంజనేయులు, రేవన్న, కిరణ్, శివకుమార్‌లు పాల్గొన్నారు.

స్తంభాన్ని ఢీకొట్టిన కారు

ఆదోని అర్బన్: పట్టణంలోని ఎమ్మిగనూరు బైపాస్ వద్ద కర్ణాటకకు చెందిన కారు సీసీ కెమెరా స్తంభాన్ని ఢీకొట్టింది. గురువారం ఉదయం కర్ణాటక రాష్ట్రం బెంగళూరుకు చెందిన నవీన్‌కుమార్ భార్య, ఇద్దరు పిల్లలతో మంత్రాలయంకు వెళ్తున్నాడు. బైపాస్ వద్ద ప్రమాదవశాత్తు డివైడర్ ఎక్కి అక్కడే ఉన్న సీసీ కెమెరా స్తంభానికి ఢీకొట్టింది. దీంతో కారు ముందుభాగం నుజ్జునుజ్జయ్యింది. అయితే ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

గృహ నిర్మాణాల పరిశీలన



పట్టణంలో గృహ నిర్మాణాలను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని శివన్న నగర్ వద్ద ఉన్న లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలను గురువారం మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి పరిశీలించారు. అసంపూర్తిగా ఉన్న గృహ నిర్మాణాలను సత్వరం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. కాగా, సమీపంలోని జోగి కాలనీలో మంచినీటి సమస్యను కాలనీలోని మహిళలు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లగా.. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకొంటామని వారికి ఆయన హామీ ఇచ్చారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



పట్టుబడిన మద్యం బాటిళ్లతో ఎక్సైజ్ సీఐ భార్గవ్ రెడ్డి

కోసిగి: మండల పరిధిలోని మూగలదొడ్డి గ్రామంలో బోయ నాగరాజు అనే వ్యక్తి అక్రమంగా కర్ణాటక మద్యం విక్రయిస్తుండగా పట్టుకున్నట్లు కోసిగి ఎక్సైజ్ సీఐ భార్గవ్ రెడ్డి తెలిపారు. గురువారం మూగలదొడ్డి గ్రామంలో దాడులు నిర్వహించి బోయ నాగరాజు పట్టుపడ్డాడన్నారు. అతని వద్ద నుంచి 384 ఒరిజనల్ చాయిస్ డీలక్స్ విస్కీ 90ఎంఎల్ టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడిని అదుపులో తీసుకుని కేసు నమోదు చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ కార్తీక్ సాగర్, హెడ్ కానిస్టేబుల్ కిశోర్ కుమార్, కానిస్టేబుల్ మునిరంగడు, రవికుమార్, జనార్దన్ రావు పాల్గొన్నారు.

బీమా ప్రీమియం రైతులే చెల్లించాలి

నందవరం : రబీ సీజన్‌లో సాగు చేసిన ప్రతి పంటకు రైతులే బీమా ప్రీమియం చెల్లించాలని ఏఓ మర్రి స్రవంతి తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ.. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజనపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. రబీ పంటలపై పంట రుణాలు తీసుకున్న రైతులకు బ్యాంకు వారు బీమా ప్రీమియం చెల్లిస్తారని వివరించారు.

మిర్చి రైతులను ఆదుకోవడంలో విఫలం



ధర్నా చేస్తున్న రైతు సంఘం నాయకులు

పెద్దకడబూరు : మిర్చి రైతులను ఆదుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలం అయ్యాయని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు భాస్కర్ యాదవ్, మండల కార్యదర్శి వీరేష్, రైతు సంఘం జిలా ఉపాధ్యక్షుడు ఆంజనేయ అన్నారు. మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో రైతుసంఘం ఆధ్వర్యంలో మిర్చి, వరి రైతులను ఆదుకోవాలంటూ గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో మిర్చికీ కనీస మద్దతు ధర ఉండేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రైతులను నిలువునా ముంచేశారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం వస్తే రైతులకు అది చేస్తాం ఇది చేస్తామని అపద్దపు హామీలతో గట్టెక్కిన వారు కనీసం రైతుల వంక చూడడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు జంగిలి మారెప్ప, మదరసాబ్, రజ్జప్ప, బుడ్డన్న, మహబూబ్, ముక్కన్న పాల్గొన్నారు.

అపార్ కష్టాలను తొలగించాలి

ఎమ్మిగనూరుటౌన్: అపార్ ఐడీ నమోదు కోసం విద్యార్థుల పడుతున్న కష్టాలను తొలగించాలని ఎస్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వీరేష్‌యాదవ్ డిమాండ్ చేశారు. గురువారం తహసీల్దార్ శేషఫణికి వినతి పత్రం అందజేశారు. అపార్ ఐడీ కోసం ఆధార్ అప్‌డేట్ చేసుకునేందుకు విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆధార్ సెంటర్లకు వెళితే విద్యార్థులను నిర్వాహకులు వెనక్కి పంపుతున్నార న్నారు. సచివాలయాలు లేదా పాఠశాలల్లోనే ఆధార్ అప్‌డేట్ చేసే సౌకర్యాన్ని కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ నాయకులు దస్తగిరి, హరీష్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అదనపు కోర్టులను ఏర్పాటు చేయాలి



తహసీల్దార్ శేషఫణికి వినతి పత్రం ఇస్తున్న న్యాయవాదులు

ఎమ్మిగనూరుటౌన్: ప్రస్తుతం ఉన్న కోర్టులకు అదనంగా మరిన్ని న్యాయస్థానాలను నియోజకవర్గంలో ఏర్పాటు చేయాలని, తద్వారా ప్రజలను సత్వర న్యాయం అందుతుందని స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు యంకే గురురాజారావు, రఘురాం కోరారు. ఈ మేరకు న్యాయవాదులు గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ శేషఫణికి వినతి పత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ గ్రామ న్యాయలయాలు ఏర్పాటు చేయడం ద్వారా ఎలాంటి ఉపయోగం లేకపోగా వాటి ద్వారా న్యాయవ్యవస్థపై ప్రజల్లో ఉన్న గౌరవం పోతుందన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఆనంద్, నాగరాజు, బాషా, కుమార్, రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపోలో వైద్యశిబిరం



ఆర్టీసీ కార్మికులకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఆదోని అర్బన్: ఆదోని రోటరీ క్లబ్ తుంగభద్ర జోన్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ డిపోలో గురువారం ఉచిత గుండె, డయాబెటిస్ వైద్యశిబిరం నిర్వహించారు. స్థానిక ఆర్టీసీ డిపోలో ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్లు, సిబ్బందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. పట్టణంలోని ప్రముఖ సీనియర్ ఫిజీషియన్‌లు డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ బాలాజీ, డాక్టర్ అవినాష్, డాక్టర్ రాఘవేంద్ర, డాక్టర్ గోవిందరాజులు, డాక్టర్ శాలిజమీల్, డాక్టర్ కౌశిక్‌గుప్తా సోమిశెట్టి, డాక్టర్ సైపుల్లా పాల్గొని వైద్య పరీక్షలు చేపట్టారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు సందీప్‌రెడ్డి, కార్యదర్శి డాక్టర్ సైపుల్లా మాట్లాడుతూ వైద్యశిబిరంలో 157 మంది కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. అలాగే వారికి ఆరోగ్య సమస్యలను తెలిపి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాలన్నారు. అంతకుముందు ఆదోని ఆర్టీసీ ఇన్‌చార్జ్ డిపో మేనేజర్ అమరనాథ్, అసిస్టెంట్ ఇంజినీర్ వేణుగోపాల్, కార్మిక సంఘం నాయకులు హరిబాబు శిబిరాన్ని సందర్శించారు.

రెసిడెన్షియల్ శిక్షణను రద్దు చేయాలి

ఆదోని సెంట్రల్: రెసిడెన్షియల్ శిక్షణా తరగతులను రద్దు చేయాలని ఎస్టీయూ రాష్ట్ర సహాధ్యక్షుడు నాగరాజు, రాష్ట్ర పురపాలక కన్వీనర్ వీరచంద్ర యాదవ్, పట్టణ అధ్యక్షుడు రవి డిమాండ్ చేశారు. గురువారం మండల వనరుల కేంద్రం(ఎమ్మార్సీ) వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ శిక్షణ తరగతుల పేరుతో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు గంగనాయక్, శ్రీరాములు, జయరాం, వెంకటరామిరెడ్డి, నిరంజన్‌రెడ్డి, నాగేంద్రగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

శిక్షణా తరగతులను వేసవిలో నిర్వహించాలి

ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణా తరగతులను వేసవి కాలంలో నిర్వహించాలని ఎస్టీయూ జిల్లా కార్యదర్శి గోపాల్ కోరారు. గురువారం ఎస్టీయూ భవనంలో ఆదోని, కౌతాళం నాయకుల సమావేశం అంజినయ్య అధ్యక్షతన జరిగింది.

5న హైందవ శంఖారావం

మంత్రాలయం: డిసెంబర్ 5న విజయవాడలో జరిగే హైందవశంఖారావం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని విశ్వహిందూ పరిషత్ సభ్యులు రాఘవేంద్ర, కృష్ణ, శివ కోరారు. గురువారం రాత్రి మండల కేంద్రంలోని అన్ని దుకాణాల సముదాయాలకు కరపత్రాలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ దేవాలయాలను రక్షించుకుందాం అనే అంశంపై బహిరంగసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సభకు సంబంధించిన ఏర్పాట్లు గురించి ఆదివారం వైష్ణవి ఇంగ్లిషు మీడియం స్కూల్‌లో సమావేశం నిర్వహిస్తున్నామన్నారు.